క్లుప్తంగా

పేదల అభ్యున్నతికి పెద్దపీట



కొమరగిరిలో పల్లెనిద్ర చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసి, వారి అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగాంగా మండలంలోని కొమరగిరిలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మా పాలనలో మీకు లబ్ధి చేకూరితేనే మాకు ఓటు వేయండి అని ధైర్యంగా ప్రకటించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్‌కుమార్, గుల్లపల్లి సత్యనారాయణ, గుర్రాల వెలమరెడ్డి, దాసరి పెదకాపు, కటారి చంటిబాబు, చింతపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫారాలపై శునకాల జోరు

సామర్లకోట: శునకాలు రైల్వే ప్లాట్‌ఫారాలపై ఇటీవల కాలంలో స్వైర విహారం చేస్తున్నాయి. దాంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. సామర్లకోట.. రైల్వే జంక్షన్ కావడంతో ఎదురుగా ఉన్న బస్సు కాంప్లెక్స్‌లో దిగిన ప్రయాణికులు రైళ్ల కోసం పరుగున ఇక్కడిడి వస్తుంటారు. ఆ సమయంలో ప్లాట్‌ఫారాలపై ఉన్న కుక్కలు వారి వెంట పడుతున్నాయి. దాంతో ప్రయాణికులు భీతిల్లుతున్నారు. రైళ్లను కూడా వదులుకుంటున్నారు. దీనిపై పలువురు ప్రయాణికులు రైల్వే మేనేజరు ఎం.రమేష్‌కు ఫిర్యాదులు చేశారు. ఆయనను వివరణ కోరగా, ప్లాట్‌ఫారంపై కుక్కలను నియంత్రించాలని మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు.

ధాన్యం లోడ్ ట్రాక్టరు బోల్తా



కెనాల్ రోడ్డులో బోల్తా పడిన ధాన్యం లోడ్ ట్రాక్టరు

సామర్లకోట: కెనాల్ రోడ్డులో మాండవ్య నారాయణస్వామి ఆలయం వద్ద ఆదివారం ధాన్యం లోడ్ ట్రాక్టరు బోల్తా పడింది. వేట్లపాలెం నుంచి చంద్రంపాలెం వెళుతున్న ధాన్యం లోడ్ ట్రాక్టరు.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే సమయంలో అదుపుతప్పింది. వాహనం బోల్తా పడే క్రమంలో ట్రాక్టరు డ్రైవరు చాకచక్యంగా తప్పించుకున్నాడు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం తమ సిబ్బందితో క్రమబద్ధీకరించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా విధుల నిర్వహణ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ సురేష్

సామర్లకోట: కార్తిక మాసం రెండో సోమవారం పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించాలని సీఐ డి.సురేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పంచారామ క్షేత్రం వద్ద సోమవారం సిబ్బందికి విధులు కేటాయించారు. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ విధులు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. ఆయా ప్రదేశాల్లో సిబ్బంది తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆలయం వద్ద విధుల నిర్వహణకు 50 మందిని నియమించారు. సీఐ వెంట ఎస్సైలు సతీష్, మూర్తి, అడపా గరగారావు ఉన్నారు.

ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శాస్త్రి



పిఠాపురం: ఆంధ్రప్రదేశ్ పాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పిఠాపురం మండలం కోలంక ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఓలేటి వీవీ శాస్త్రి ఎంపికయ్యారు. ఇప్పటివరకూ ఆంధ్రప్రదేశ్ పాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయనకు పదోన్నతి లభించింది. విజయవాడలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను సంఘ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ చలపతి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కార్తిక పౌర్ణమి పూజలు చేస్తున్న అర్చకులు



ఆలయంలో బారులు తీరిన భక్తులు



ఉత్సాహంగా నిర్వహిస్తున్న జ్వాలా తోరణం

నమో నీలకంఠా..

- పంచారామ క్షేత్రంలో భక్తజన సందోహం
- భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి పూజలు
- పరమేశ్వరునికి లక్షపత్రి పూజలు, దీపారాధనలు
- ఆకట్టుకున్న గ్రామోత్సవం, గోదావరి హారతి, జ్వాలాతోరణం

సామర్లకోట: కార్తిక మాసం శివునికి ఎంతో ప్రీతైనది. పంచారామ క్షేత్రంలో శివుడిని దర్శించుకోవడం వల్ల శుభ ఫలితాలు ఉంటాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలోనే స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తిక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. నూతన వధూవరులు ఉపవాస దీక్ష చేసి, ఆలయంలో పూజలు చేసి, అర్చకులకు బియ్యం, కూరగాయలు, పండ్లు దానంగా ఇచ్చారు. సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హరహర మహాదేవ,, శంభోశంకర.. అంటూ భక్తుల నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్తిక మాసంలో దీపాల వెలిగిస్తే పుణ్యం వస్తుందనే నమ్మకంతో, పిల్లలు, పెద్దలు, మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించారు. ఆలయంలో ధ్వజ స్తంభం, జమ్మి చెట్టు, తులసీ కోట, మారెడు చెట్టుతో పాటు ఆలయమంతా దీపాలతో ప్రజ్వలించింది. పారిశ్రామికవేత్త బిక్కిన సాయి కుటుంబ సభ్యులు లక్షపత్రి పూజలు చేశారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి అల్లు వెంకటదుర్గభవాని ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగ్గా, ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్త కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమంలో సేవలందించారు.

ఉత్సాహంగా గ్రామోత్సవం

స్వామివారి, అమ్మవారి గ్రామోత్సవం మధ్యాహ్నం భక్తిశ్రద్ధలతో సాగింది. కార్తిక పౌర్ణమి కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను పూలతో అలంకరించి, ప్రత్యేక సర్ప వాహనంపై ఆలయం నుంచి ఊరేగించారు. ఉత్సవాధికారి వెంకట దుర్గభవాని ప్రారంభించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, కొంతేటి జోగారావు, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే గేటు మీదుగా గ్రామోత్సవం గాం. దీచౌక్‌కు, అక్కడి నుంచి చిన్నవీధి, బళ్ల మార్కెట్ సెంటర్, యార్లగడ్డవారి వీధి, రత్నంగారి ఆస్పత్రి, మఠం సెంటర్, కొత్తూరు, అయోధ్య రామపురం, దేవిచౌక్ మీదుగా రాత్రికి ఆలయానికి చేరింది.



గోదావరి హారతి ఇస్తున్న పండితులు

భక్తిశ్రద్ధలతో గోదావరి హారతి

గోదావరి కాలువలో భక్తిశ్రద్ధలతో హారతి కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. గోదావరి కాలువ రేవులో సాయంత్రం పౌర్ణమిని పురస్కరించుకుని గోదావరి హారతి నిర్వహించారు. పంచారామ క్షేత్ర పండితులు పూజలు జరిపి, గోదావరి దేవికి హారతి ఇచ్చారు.



లక్షపత్రి పూజలు చేస్తున్న బిక్కిన సాయి కుటుంబ సభ్యులు

జ్వాలాతోరణంలో పోటీపడ్డ భక్తులు

పంచారామ క్షేత్రంలో ఆదివారం రాత్రి ఉత్సాహంగా జ్వాలాతోరణం జరిగింది. రెండు కర్రలకు ఎండుగడ్డి తాళ్లు కట్టి, మధ్యలో మూడు కొబ్బరి బోండాలను ఏర్పాటు చేశారు. స్వామివారి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచారు. ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చిన సమయంలో గడ్డికి నిప్పు పెట్టి, స్వామివారి, అమ్మవారి ఉత్సవమూర్తులున్న పల్లకిని మూడు పర్యాయాలు హరహర మహాదేవ శంభోశంకరా అంటూ అటూ ఇటూ తిప్పారు. ఈ సమయంలో కొబ్బరి బోండాను తెంచడానికి భక్తులు పోటీ పడ్డారు. జ్వాలాతోరణంలో కట్టిన కొబ్బరి బోండాలు లభించిన భక్తులు అదృష్టవంతులనే నమ్మకం ఉంది. తమకు మంచి జరుగుతుందన్న నమ్మకంతో జ్వాలాతోరణంలో నిప్పు అంటుకున్న గడ్డిని తీసుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు.

తీరం.. భక్తజన హారం



ఉప్పాడ సాగర తీరంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ సాగర తీరంలో ఆదివారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బీచ్‌కు తరలివచ్చి పుణ్యస్నానాలు చేశారు. అనంతరం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పర్యాటకుల సందడి

ఉప్పాడ తీరంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా వివిధ రకాల ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగర తీరంలో సేద తీరారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది.



తిరుపతి శృంగార వల్లభుడి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హరహర మహాదేవ

- భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు



కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

పిఠాపురం: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉమాకుక్కుటేశ్వరస్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఉపవాస దీక్షలు చేసిన భక్తులు సాయంత్రం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిళ్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. రాత్రి స్వామివారి జోలా తోరణం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి ఉపావాసం ఉన్న భక్తులు సాయంత్రం ఒక్కసారిగా ఆలయానికి చేరుకోవడంతో రద్దీ నెలకొంది. స్థానిక పురుహూతిక అమ్మవారిని అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. ఇటీవల వివాహమైన కొత్త జంటలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.

పెద్దాపురం: భక్తుల శివ పంచాక్షరి జపంతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శైవ క్షేత్రాలు మార్మోగాయి. ఆదివారం కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పెద్దాపురం పట్టణంలోని శివాలయం, తిరుపతి శృంగార వల్లభుడి ఆలయం, పాండవులమెట్టపై ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు హర హర శివ శంకర జపంతో స్నానమాచరించి, భక్తిశ్రద్ధలతో కార్తిక నోములు నోచుకున్నారు.

మరిడమ్మ ఆలయంలో..

కార్తిక పౌర్ణమి సందర్భంగా మరిడమ్మ అమ్మవారి ఆలయంలో కార్తిక దీపాలంకరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఏసీ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారి చండీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ చేయగా, భక్తులు దీపాలను వెలిగించారు.



పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు



గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వరస్వామి

ఘనంగా నందీశ్వరుని ఊరేగింపు

కొత్తపల్లి: మండలంలోని మూలపేట, కొత్తపల్లిలో గౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నందీశ్వరుని ఘనంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా శివ పార్వతుల ప్రతిరూపంగా కొలిచే నందీశ్వరుని కార్తిక పౌర్ణమి పర్వదినాల్లో పూజిస్తే సతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ మేరకు వందలాది మంది మహిళలు స్వామివారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.



మూలపేటలో నందీశ్వరుని ఊరేగిస్తున్న భక్తులు

28న ఉచిత వైద్య శిబిరం

పెద్దాపురం: కాండ్రకోట గ్రామంలో ఈ నెల 28న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు పీఎంపీ వైద్యుడు రామవరపు జగదీష్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ మెడికవర్, కాండ్రకోట జగదీష్ మెడికల్ స్టోర్ సంయుక్తాధ్వర్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గుండె సమస్యలకు సీఈజీ, బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. జగదీష్ మెడికల్ షాపులో జరిగే ఈ వైద్య శిబిరంలో మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

ఈ-వ్యర్థాల నిర్వహణ ప్రయోజనకరం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు

కాకినాడ: పర్యావరణానికి ఈ-వ్యర్థాలతో తీవ్ర హాని కలుగుతుందని కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత పేర్కొన్నారు. తగిన జాగ్రత్తలు వహించడం ద్వారా నష్టాలను నివారించవచ్చని చెప్పారు. కాకినాడలో ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించి, మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం భానుగుడి నుంచి సర్పవరం జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇదే సందర్భంగా మహిళలపై జరుగుతున్న హింసా వ్యతిరేక దినం సందర్భంగా మార్పు కోసం పరుగు పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ ఈ-వ్యర్థాల నిర్వహణలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల పాత్ర కూడా ఎంతో కీలకమన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఈ-వ్యర్థాలులేని నగరంగా కాకినాడను తీర్చిదిద్దేందుకు మైత్రేయి సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మైత్రేయి సంస్థ అధ్యక్షురాలు సీహెచ్ శుషిఆదిత్యకుమార్ మాట్లాడుతూ ఈ-వ్యర్థాలను తమ కేంద్రానికి అందజేస్తే, సర్టిఫికేట్‌తో పాటు ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ కమిషన్ సభ్యులు చాగంటి నాగేశ్వరరావు, ట్రస్ట్ హాస్పటల్ ఎండీ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆదిత్యకుమార్, మైత్రేయి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణే దేశభక్తి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దొరబాబు తదితరులు



భీమ్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు



వాకతిప్పలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రామారావు

- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

పెద్దాపురం: రాజ్యాంగ రక్షణే దేశభక్తికి నిదర్శనమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషరన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తొలుత అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం అందరితో దొరబాబు ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సామర్లకోట వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, మద్దాల శ్రీను, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు. విడదాసరి రాజా, సేపేని సురేష్, నేతల హరిబాబు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెటి గంగ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో..

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ భానుకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో..

జవహర్ నవోదయ విద్యాలయలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ ఆర్.కమలం మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో..

సామర్లకోట: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు ఆధ్వర్యంలో జోహార్లు అర్పించారు. భారత రాజ్యాంగానికి కట్టుబడి విధులు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళులు

కొత్తపల్లి: మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాకతిప్పలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలని దొరబాబు, దాకే రాజ్‌కుమార్, గొరిసే కాపురెడ్డి, తొమ్మండ్ర సురేష్ , సానా నాగు తదితరులు పాల్గొన్నారు. యండపల్లి శివారు జొన్నలగరువులో ఏపీ మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దడాల సత్తిబాబు, దార వెంకట్రావు, ఎంపీటీసీ బర్రె రవి, మంజువరపు కృపానందం, బందిలి సూరిబాబు పాల్గొన్నారు.


రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

పెద్దాపురం: మతోన్మాదుల చేతుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ స్వేచ్ఛా, సమానత్వంపై బీజేపీ దాడులు చేస్తోందని దుయ్యబట్టారు. రాజ్యాంగంలో ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, ఎం.రాంబాబు, కృష్ణ, వీర్రాజు, చల్లా విశ్వనాథం, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

పిఠాపురం: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిఠాపురం మండలం భీమనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత వులవల భూషణం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చుక్కా అప్పారావు, వడ్డి రాజు, రోకళ్ల సూరిబాబు, పులుగు బాబూరావు, దుల్లపల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి జ్యోతిర్లింగార్చన భక్తులను అలరించింది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న వారి కోసం ఆలయ దీపారాధన కమిటీ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. భక్తులు దానిలో దీపాలు వెలిగించారు. ఆలయంలోని ధ్వజస్తంభం ఆకాశదీపానికి దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆకాశ దీపం వెలిగించారు. తరువాత ఆలయంలోని జ్యోతిర్లింగార్చనలో దీపాలను భక్తులు వెలిగించారు. శివాలయంలోని జ్యోతిర్లింగార్చన తిలకించడంతో శుభ ఫలితాలు ఉంటాయనేది నమ్మకం. దాంతో దీపాలను తిలకించి పూజలు చేశారు.